ప్రజల ఆకాంక్షల మేరకు పాలన

పెద్దపల్లి టౌన్ : మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. అభివాదనం చేస్తున్న ఎమ్మెల్యేలు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 17: ప్రజల ఆకాంక్షల మేరకు పాలన అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఔటర్ రింగ్ రోడ్డు, ఆర్టీసీ బస్ డిపో నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనం కూడిన పాలన అందిస్తామని చెప్పారు. పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో అఖండ మెజార్టీ అందించినందుకు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టం చేశారు. తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, కోట శ్రీనివాస్ గౌడ్, భూషణవేన సురేశ్ గౌడ్, కొలిపాక శ్రీనివాస్, నూగిల్ల మల్లయ్య, గుండేటి ఐలయ్యయాదవ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు చింతించవద్దు

కమాన్‌పూర్, డిసెంబర్ 17: ఆటోడ్రైవర్లు చింతించాల్సిన అవసరం లేదని.. వారిని ఆదుకునేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన శ్రీధర్ బాబుకు కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆటో ఓనర్లు, డ్రైవర్లు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆటోడ్రైవర్లు గిరాకీ లేక జీవనో పాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనోపాధికి మార్గం చూపాలని కమాన్ పూర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు అందించే కార్యక్రమం చేపట్టబోతున్నామని తెలిపారు. ఆటో నగర్ పెట్టుకుంటే స్థలంతో పాటు ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్, డిసెంబర్ 17 : రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. శాస్త్రీనగర్‌లోని అభయాంజనేయాస్వామి దేవాలయంలో పూజారులు గూడ రమేశ్ శర్మ, కాంగ్రెస్ నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అక్కడి నుంచి రాజీవ్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓదెల, డిసెంబర్ 17: తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి మంథని నియోజకవర్గానికి వెళ్తున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుడు గుండేటి ఐలయ్య యాదవ్ సుల్తానాబాద్‌లో ఘనస్వాగతం పలికారు. మంత్రి, ఎమ్మెల్యే విజయరమణారావుకు గొర్రెపిల్ల, గొంగడి బహూకరించి స్వాగతం పలికారు.

అడ్లూరికి ఘన స్వాగతం

ధర్మారం,డిసెంబర్17: స్థానిక ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. విప్ హోదాలో తొలిసారి వచ్చిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన ఆటో డ్రైవర్లు

ఉపాధి దెబ్బ తీయొద్దని ఆటో డ్రైవర్ల ఆందోళన

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్17: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి తమ ఉపాధిని దెబ్బతీయొద్దంటూ మండలంలోని ఆటో డ్రైవర్లు కాల్వశ్రీరాంపూర్‌లో ఆదివారం ఆందోళనకు దిగారు. అన్ని గ్రామాల నుంచి ఆటో డ్రైవర్లు తరలివచ్చి స్థానిక బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఆటోలపై ఆధారపడి బతుకుతున్న తమకు ప్రభుత్వం ఉపాధి చూపాలని కోరారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన తమకు గిరాకీ లేక నెలనెల కిస్తీలు ఎలా కట్టాలని, కుటంబాన్ని ఎలా పోషించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు మేకల కుమార్, చల్ల చంద్రమౌళి, బర్ల తిరుపతి, అశోక్, నందు, రఫీక్, లింగమూర్తి, నాగరాజు, కార్తీక్ ఉన్నారు.

వైభవంగా మల్లన్న శోభాయాత్ర

శోభాయాత్రలో ఒగ్గు కళాకారుల విన్యాసాలు

కమాన్‌పూర్, డిసెంబర్ 17: జూలపల్లి గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి శోభాయాత్ర వైభవంగా జరిగింది. గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలోని స్వామి వారి ప్రతిమలను పల్లకీలో ఉంచి బంతి పూలతో అలంకరించారు. ఆలయ నిర్వాహకులైన ఎలబోయిన వంశీయులు ఇంటి నుంచి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారి గుండా స్వామి వారిని ఆలయం వరకు ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాలతో పాటు విన్యాసాలు, మహిళల కోలాటాల నృత్యాల నడుమ కనుల పండువగా శోభాయాత్ర కొనసాగింది. ఏటా షష్ఠి వారాలు ప్రారంభంలో భాగంగా మల్లికార్జున స్వామి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఇక్కడ అన్నదాన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శోభాయాత్రగా వెళ్తున్న అయ్యప్ప దీక్షాపరులు

ఘనంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం

ధర్మారం,డిసెంబర్17: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయంలో వ్యవస్థాపక చైర్మన్ తాటిపల్లి ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆరట్టు ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జరిగింది. వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి అర్చకుడు నర్సింగారావు నేతృత్వంలో అభిషేకం చేశారు. అయ్యప్ప దీక్షాపరులు ఆలయ మండపంలో హోమం చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహంతో దీక్షాపరులు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వాహనాల్లో స్వామి వారి విగ్రహాన్ని రాయపట్నంలోని గోదావరికి తీసుకెళ్లి జలాభిషేకం చేయించారు. అనంతరం ఆలయానికి చేరుకొనిపూజలు చేశారు. కాగా ఈనెల 28న ఆలయం ఆవరణలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ తెలిపారు.

వివాహ వేడుకలకు మాజీ మంత్రి కొప్పుల హాజరు

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం,డిసెంబర్17: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన శుభ కార్యక్రమాలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. ఖిలావనపర్తిలో బీఆర్ఎస్ నేత, శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ హన్మాన్ సింగ్–చాందూ బాయి కూతురు రోషిణి ప్రియ వివాహ వేడుకకు ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బొట్లవనపర్తిలోని ఎస్సీ కాలనీలో పార్టీ నాయకుడు కోండ్ర రాజేందర్ కూతరు శ్రీజ నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దొంగతుర్తిలో ఎంపీటీసీ దాడి సదయ్య నూతన గృహ ప్రవేశానికి ఈశ్వర్ హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు ఉన్నారు.

అవగాహన

జూలపల్లి, డిసెంబర్ 17 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం 'శేష రత్నం' ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో వంట గ్యాస్ వినియోగదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు ఈ కేవైసీ గురించి వివరించారు. మహిళలు ప్రభుత్వం నుంచి రాయితీ పొందడానికి ఈ నెల 31లోగా ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. సంస్థ డీలర్ భవానిని కాలనీ వాసులు అభినందించారు. ఇక్కడ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, నెరువట్ల తేజ్‌రాజ్, బెజ్జంకి సంతోష్, నెరువట్ల దుర్గయ్య, నెరువట్ల రవి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

జూలపల్లి, డిసెంబర్ 17 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్కాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రికెట్ క్రీడా సామగ్రి అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నట్లు సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జెట్టి సతీశ్, నాయకులు జెట్టి రాజయ్య, బొల్లపల్లి అంతయ్య, కలవేని మల్లయ్య, రితిక్, చరణ్, సిద్ధార్థ, విష్ణు, మనోజ్, హర్షిత్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో గాయత్రి విద్యార్థిని ప్రతిభ

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 17 : శాతవాహన యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో పెద్దపల్లి గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల బీఎస్సీ (ఎంపీసీఎస్) విద్యార్థిని చెల్పూరి చందన (9.12) ఎస్‌జీపీఏ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. అలాగే (8.0) ఎస్‌జీపీఏ పైన 82 మంది విద్యార్థుల సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జే రవీందర్, అధ్యాపకులు అభినందించారు.

కష్టాలకు కుంగిపోవద్దు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 17: చిన్న చిన్న సమస్యలకు కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఊష అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసరి ఊష మాట్లాడారు. మనిషికి అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి వెతుక్కుంటారన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో మేమున్నామంటూ భరోసానిస్తే ఆత్మహత్య నుంచి ఎవ్వరైనా బయటపడుతారని తెలిపారు. ఇక్కడ వెంగటి శుభ, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ కుమార్, చంద్రమౌళి, వినయ్, ఎడెల్లి అశోక్, ప్రణయ్, వశిష్ట పాల్గొన్నారు.

ప్రమాణం చేయిస్తున్న దాసరి ఊష

మద్యానికి బానిసై ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్17: వెన్నంపల్లి గ్రామానికి చెందిన జంపాల మల్లయ్య(57) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మల్లయ్య కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం మద్యం మత్తులో ఉన్న మల్లయ్య ఇంటి ఆవరణలో ఉన్న గడ్డి మందు (పురుగుల మందు)ను మద్యం అనుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మల్లయ్యను పెద్దపల్లికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మల్లయ్య భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.